7

సాక్షి ప్రకాశం

మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



విశ్లేషణాత్మక అధ్యయనంతో విజయం

విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తే విజయం సొంతం చేసుకోవచ్చని సివిల్స్ విజేత బాలలత పేర్కొన్నారు. 'సాక్షి' అవగాహన సదస్సులో మాట్లాడారు.

- 8లో..



ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
25.1/23.7

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. భారీ వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి



కొణిజేటి రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

ఒంగోలు: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక వైశ్య భవన్‌లో ఆర్యవైశ్య సంఘ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ నిబద్ధత గల నాయకునిగా, సాధారణ స్థాయి నుంచి ముఖ్యమంత్రి వరకు, తమిళనాడు గవర్నర్‌గా ఆయన అందించిన సేవలు నిరుపమానమైనవన్నారు. ఆర్యవైశ్యులకు నిత్యం అండగా ఉంటూ ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నా ఒదిగి ఉండడమే లక్ష్యంగా ఎంతోమందికి ఆపన్న హస్తం అందించిన రోశయ్య సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకులతో కలిసి పేదలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావూరి కాశీ రంగా జనార్దన్, జలదంకి వెంకట కృష్ణారావు, జిల్లా గౌరవ సలహాదారులు పల్లపోతు వెంకటేశ్వర్లు, మాజీ కార్యదర్శి కూరపాటి సత్యన్నారాయణ, పెనుగొండ శ్రీనివాసులు, సమతలూరి సత్యం, పబ్బిసెట్టి శ్రీనివాసరావు, హరీష్ కుప్పం, కోడూరి కిషోర్, జిల్లా ఉపాధ్యక్షులు అనుములశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్‌కు ఆత్మీయ సత్కారం



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న కుప్పం ప్రసాద్ తదితరులు

ఒంగోలు: డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఆర్యవైశ్యులు ఆత్మీయంగా సత్కరించారు. సోమవారం తిరుమల వెళ్లి వస్తూ ఆయన మార్గం మధ్యలో స్థానిక ఢిల్లీ హైవే హోటల్‌లో ఆగారు. ఈ సందర్భంగా ఆయనను ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావూరి కాశీ వెంకట రంగ జనార్ధన్, జలదంకి వెంకట కృష్ణారావు, హరీష్ హరి, మట్టా హర్ష, దేవతు రాజా, మురళి, శ్రావణ్ కలిసి సత్కరించారు.

ఏఎన్‌యూ పరీక్షలు ఈనెల 9కి వాయిదా

ఒంగోలు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెండో సంవత్సరం మూడో సెమిస్టర్‌కి సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కోఆర్డినేటర్ రెడ్డి ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ జరగాల్సిన పరీక్షను ఈనెల 9వ తేదీకి, ఈనెల 5వ తేదీ జరగాల్సిన పరీక్షను ఈనెల 10వ తేదీకి వాయిదా వేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మిచాంగ్ వణుకు

మిచాంగ్ తుఫాన్ జిల్లాలోని తీర ప్రాంత మండలాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఒక వైపు భారీ వర్షం..
మరోవైపు ఈదురు గాలులతో ప్రజలు వణికిపోతున్నారు. సముద్రం అల్లకల్లోలంగా మారింది. రాకాసి అలలు ఎగసి పడుతున్నాయి. పాకల తీరంలో కొంత భాగం కోతకు గురైంది. మంగళవారం నాటికి మిచాంగ్ మరింత బలపడి తీవ్ర తుఫాన్‌గా మారుతుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి.



పాకల సముద్ర తీరంలో ఉధృతంగా ఉన్న అలలు



ఒంగోలు నగరంలో ఈదురుగాలికి ఊగుతున్న చెట్లు

పునరావాస కేంద్రాలు: 47

టోల్‌ఫ్రీ నంబర్లు 100, 1077

- జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులు, భారీ వర్షాలు
- లోతట్టు, తీర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు
- రక్షణ చర్యల్లో అధికార యంత్రాంగం
- ముంపు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు
- సహాయక చర్యల కోసం అధికార యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం
- అనుక్షణం పర్యవేక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్
- జిల్లా ప్రత్యేక అధికారిగా సీనియర్ అధికారి ప్రద్యుమ్న



కె.పల్లెపాలెంలో లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్ మంగళవారం మరింత బలపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ ప్రభావంతో ఆదివారం నుంచి జిల్లా వ్యాప్తంగా చలిగాలులు, భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. తీరప్రాంత మండలాలైన కొత్తపట్నం, సింగరాయకొండ, టంగుటూరు, ఒంగోలు, నాగులుప్పలపాడు మండలాల్లో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. తీర గ్రామాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పాత ఇళ్లు, పూరిళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. తుఫాన్ ప్రభావం సుమారు 18 వేల మందిపై ఉంటుందని అంచనా వేసి 47 తుఫాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి శిబిరానికి ఒక ప్రత్యేక అధికారిని కలెక్టర్ నియమించారు. శిబిరాల్లో ఉంటున్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన ఆహారం, తాగునీరు ఇతర వసతులు కల్పిస్తున్నారు. అవసరమైన ఔషధాలు సైతం అందుబాటులో ఉంచారు. ఇప్పటికే మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. పడవలు, వలలు ఇతర సామాగ్రి సైతం జాగ్రత్త చేసుకునేలా మత్స్యకారులకు అవగాహన కల్పించారు.తుఫాన్ ప్రభావిత జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా వీడియో సమావేశాల ద్వారా పర్యవేక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటకు నష్టం వాటిల్లకుండా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత యంత్రాంగం రైతులకు అవగాహన కల్పించడంతో పాటు తగిన సహకారం అందిస్తోంది. తుఫాన్ సహాయక చర్యలకు సంబంధించి జిల్లాలో పర్యవేక్షించేలా సీనియర్ అధికారి పీఎస్ ప్రద్యుమ్నను రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌గా నియమించింది. మంగళవారం కూడా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

ప్రత్యేక బృందాలు సిద్ధం:

తుఫాన్ జాగ్రత్త, రక్షణ చర్యల కోసం జిల్లా అధికార యంత్రాంగంతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సైతం సిద్ధంగా ఉన్నాయి. తీర ప్రాంత మండలాల్లో పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించేందుకు మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక రాష్ట్ర ప్రభుత్వం అధికారులుగా సీనియర్ అధికారులను కలెక్టర్ నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌తో పాటు ఎస్పీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా కంట్రోలు రూములను ఏర్పాటు చేశారు. మండల స్థాయి నుంచి ప్రతి రెండు గంటలకు ఒకసారి వివరాలను కలెక్టరేట్‌కు తెలిపేలా చర్యలు తీసుకున్నారు. తుఫాన్‌కు సంబంధించి ప్రజలకు ఏ అవసరం, ఆపద ఎదురైనా 100, 1077 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు.వర్షాలు, గాలులతో చెట్లు కూలితే వెంటనే తొలగించేలా పోలీసు, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక శాఖల సిబ్బందితో ప్రత్యేక బృందాలను పోలీసు స్టేషన్‌లలో అందుబాటులో ఉంచారు. విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరిగితే అప్పటికప్పుడే స్పందించేలా విద్యుత్ శాఖ తరఫున 500 మంది సిబ్బందిని రంగంలోకి దించారు.

పలు మండలాల్లో పర్యటించిన జిల్లా వ్యవసాయాధికారి

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మద్దిపాడు, తాళ్లూరు, ఎస్ఎన్‌పాడు మండలాల్లో పర్యటించారు. వరి, మొక్కజొన్న, పత్తి, పొగాకు, మిరప పంటలను పరిశీలించి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తుఫాన్ వలన ఏవైనా నష్టం కలిగితే వ్యవసాయ శాఖా కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు నంబర్: 8331057049 కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.



ఒంగోలు మండలం గుండాయపాలెంలో ఒడ్డుకు చేర్చిన పడవలు

జిల్లాలో 534.6 మి.మీల వర్షపాతం

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో సోమవారం 534.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ శైలజ తెలిపారు. రెండు రోజుల్లో 641.2 మి.మీలు వర్ష కురిసినట్టు ఆమె చెప్పారు. జిల్లాలో సోమవారం 38 మండలాలకు గాను 27 మండలాల్లో వర్షపాతం నమోదైంది. అందులో అత్యధికంగా కొత్తపట్నం మండలంలో 95.4 మి.మీలు, టంగుటూరులో 62.2, సింగరాయకొండలో 49.8, జరుగుమల్లిలో 49, ఒంగోలు 33.8, కొండపి, పొన్నలూరులో 30.4, ఎస్ఎన్‌పాడులో 25, మద్దిపాడులో 21.8, ఎన్‌జీపాడు 21.2, పీసీపల్లి 17.4, చీమకుర్తి 16.2, సీఎస్‌పురం 13.8, వెలిగండ్ల 9.6, తాళ్లూరు 8.6, ముండ్లమూరు 8.4, మర్రిపూడి 8.2, పామూరు 7.6, కనిగిరి 7.4, కొమరోలు 5.2, హెచ్ఎంపాడు 3.6, కురిచేడు 2.8, పుల్లలచెరువు 1.6, దర్శి, రాచర్లలో 1.4, మార్కాపురం, కంభంలలో 1.2 మి.మీల వర్షపాతం నమోదైంది. జిల్లాలో మరో రెండు రోజుల పాటు తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో వ్యవసాయశాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు, పశ్చిమ ప్రాంత రైతాంగం మాత్రం వర్షంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

తుఫాన్ బాధితులు పునరావాస కేంద్రాలకు తరలింపు

కొత్తపట్నం: మిచాంగ్ తుఫాన్ బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి గాలి, అధిక వర్షం కురవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనిపించలేదు. రెండు రోజుల నుంచి రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పూరిళ్లు, లోతట్టు ప్రాంతాల కుటుంబాలను కలిసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరించారు. మధ్యాహ్నం గాలులు, వర్షం ఎక్కువ కావడంతో ఆలూరు, గాదెపాలెం తుఫాన్ బాధితులను ప్రాథమిక పాఠశాలలకు, కె.పల్లెపాలెం ప్రజలను నూతనంగా నిర్మించిన హెల్త్ క్లినిక్ సెంటర్, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు తరలించారు. ఉదయం టిఫిన్, భోజనాలు, తాగునీరు సరఫరా చేశారు. మొత్తం 227 మంది తుఫాన్ బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

అందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

తుఫాన్ తీవ్రత ఎక్కువవుతుండటంతో పూరిళ్లు, ఇళ్లు సరిగా లేని వారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ప్రజలకు చెప్పారు. కొత్తపట్నం మండలంలోని పునరావాస కేంద్రాలను పరిశీలించారు. విలువైన వస్తువులు, వేట సామగ్రి భద్రపర్చుకోవాలని మత్స్యకారులకు సూచించారు. మండలంలో అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి వసతులు కల్పించాలని తహశీల్దార్ రమణారావును ఆదేశించారు. కె.పల్లెపాలెం గ్రామంలో 50 ఇళ్ల దాకా లోతట్టు గృహాలు ఉన్నాయని, వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్‌రావు, ఈవోఆర్డీ ఏ.బాలచెన్నయ్య, సచివాలయం సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ అత్యవసర ఖర్చులకు కోటి రూపాయలు

తుఫాన్ ఖర్చుల కోసం టీఆర్–27 కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.1 కోటి కేటాయించింది. శిబిరాల్లో ఉంటున్న బాధితులకు అవసరమైన భోజనాలకు, ఇతర వస్తువుల కొనుగోలు కోసం తహశీల్దార్లకు రూ.18 లక్షల నిధులు కలెక్టర్ విడుదల చేశారు. ప్రతి పునరావాస శిబిరానికి డిప్యూటీ తహశీల్దార్, ఈఓపీఆర్డీ వంటి అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. పరిస్థితి కుదుటపడి శిబిరాల నుంచి బాధితులు ఇళ్లకు వెళ్లేటపుడు ఒక్కో కుటుంబానికి రూ.2500 లెక్కన ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నీళ్లు నిలిచి ఇళ్లలో నుంచి రెండు రోజుల పాటు బయటకు రాలేని పరిస్థితి ఉంటే అలాంటి కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలతో పాటు కేజీ వంట నూనె సరఫరా చేసేలా యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఆమేరకు తీర ప్రాంతాల్లోని రేషన్ డీలర్లకు సరుకులు పంపిణీ చేశారు.



అమ్మనబ్రోలులో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించిన దృశ్యం



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

తీర ప్రాంత మండలాలకు తుఫాన్ స్పెషలాఫీసర్లను ప్రభుత్వం నియమించింది.

మండలం	స్పెషలాఫీసర్ పేరు	సెల్ నంబర్
ఒంగోలు అర్బన్	ఎం.వి.లోకేశ్వరరావు, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్	8886616088
ఒంగోలు రూరల్	టి.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ	7997952601
కొత్తపట్నం	ఎం.లక్ష్మీనరసింహం, ఎస్‌డీసీ, బీకేవీ ఎక్స్‌ప్రెస్	7995927494
నాగులుప్పలపాడు	కె.శీనారెడ్డి, డ్వామా పీడీ	8790009111
సింగరాయకొండ	ఎస్.లక్ష్మణ్ నాయక్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్	9492656138
టంగుటూరు	జి.సువర్ణమ్మ, స్పెషల్ కలెక్టర్ పీఏ	8985501725



కె.పల్లెపాలెం పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న ప్రజలు



కె.పల్లెపాలెంలో పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలతో మాట్లాడుతున్న రమణారావు, ఆనంద్‌రావు

బాలినేని కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి



ప్రజలకు భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

- తుఫాన్‌పై నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేసిన బాలినేని
- పలు ప్రాంతాల్లో పేదలకు ఆహార పొట్లాల పంపిణీ
- స్వయంగా శివారు ప్రాంతాల్లో పర్యటించిన బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: మిచాంగ్ తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అప్రమత్తం అయ్యారు. తన కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ఆయన అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక వైపు అధికారులతో మాట్లాడుతూనే మరో వైపు పార్టీ నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేశారు. ఏయే ప్రాంతాల్లో పరిస్థితి ఏంటనేది తెలుసుకుని తక్షణమే ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈమేరకు ఐదు హెల్ప్‌లైన్ నంబర్లను మీడియాకు విడుదల చేశారు. ఎవరైనా, ఏదైనా సహాయం అవసరం అని భావించిన వారు ఈ నంబర్లకు కాల్ చేయాలని బాలినేని విజ్ఞప్తి చేశారు. హెల్ప్‌లైన్ నంబర్లు: 9949796033, 8555931920, 9000443065, 7661834294, 8555871450లకు కాల్ చేయాలని సూచించారు.

శివారు ప్రాంతాల్లో పర్యటించిన ప్రణీత్‌రెడ్డి:

వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్ రెడ్డి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. తుఫాన్ ప్రభావం శివారు ప్రాంతాల్లోని ప్రజలకు ఏమైనా సమస్యలు సృష్టిస్తుందా అనేది పరిశీలించారు. కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి లోతట్టు ప్రాంతాల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్, నేతాజీ కాలనీ, బలరాం కాలనీ తదితర ప్రాంతాల్లో తుఫాన్ కారణంగా ఇళ్ల నుంచి బయటకు రాలేక ఆహారానికి ఇబ్బంది పడుతున్న వెయ్యి మందికిపైగా ప్రజలకు ఆహార పొట్లాలు అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. నగర మేయర్ గంగాడ సుజాత, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావులతో సమస్యల గురించి చర్చించారు. కార్పొరేటర్లు అంబటి ప్రసాదరావు, గండు ధనలక్ష్మి మధు, నాయకులు గంటా రామానాయుడు తదితరులు ప్రణీత్‌రెడ్డితోపాటుగా శివారు ప్రాంతాల్లో పర్యటించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీ మాగుంట

ఒంగోలు: మిచాంగ్ తుఫాన్ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండడంతోపాటు మత్స్యకారులు కూడా సముద్రంలోకి వెళ్లకుండా ఉండాలని, కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్లతో మాట్లాడి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారన్నారు.

తుఫాన్ సహాయక చర్యలను పరిశీలించిన జేసీ



ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్ సహాయక, జాగ్రత్త చర్యలను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోలు రూమును పరిశీలించి ఫోన్ కాల్స్ వచ్చిన అంశాలను పరిశీలించి వాటిపై ఏ చర్యలు తీసుకున్నారో ఆరా తీశారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

- జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ తీవ్రత నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని తుఫాన్ సెల్ నుంచి సోమవారం ఆమె మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారి, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. జిల్లాలో 97 మంది గర్భిణులు, మరికొంత మంది హైరిస్క్ మహిళలను ఈ వారంలో డెలివరీ చేయాల్సి ఉందని, వారిని వెంటనే ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల వద్ద తప్పనిసరిగా వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు అన్నీ పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వెనమ్‌ను అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన 47 సైక్లోన్ రిలీఫ్ క్యాంపుల వద్ద ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వాటిని కొనసాగించాలని ఆదేశించారు. అంటువ్యాధులు, దోమలకాటు నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ జ్వరాల బారిని పడకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని చెప్పారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎపిడమిక్ సెల్‌లో సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, 98668 82639 కు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

ఆరుగురు వైద్యులతో రిమ్స్ ప్రత్యేక బృందం

మిచాంగ్ తుఫాన్ విపత్తును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం వైద్యశాఖను సంసిద్ధం చేసింది. ఇప్పటికే వైద్యారోగ్య శాఖ ద్వారా జిల్లాలోని అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్రమత్తం చేసింది. తుఫాన్ సహాయక కేంద్రాల వద్ద వైద్యారోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో కూడా ఆరుగురు వైద్యులు, ఒక సీనియర్ స్టాఫ్‌నర్స్‌తో కమిటీని ఏర్పాటు చేసింది. డా.ఎం ప్రభాకరరావు, డా.జయ సుందరం, డా.జాన్ రిచర్డ్స్, డా.జీఎస్ఆర్ హరిష్, డా.ఏఎస్‌బీ తిరుమలరావు, డా.శ్రీనివాసరావు, సీనియర్ స్టాఫ్‌నర్స్ జోయల్ కూడిన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డా.భగవాన్ నాయక్ తెలిపారు. అలాగే జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది, మెడికల్ కాలేజి అధ్యాపకులంతా తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు సెలవులు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్

● నిందితులకు 14 రోజుల రిమాండ్

హనుమంతునిపాడు: ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇతరులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన ముగ్గురు నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు. మండల పరిధిలోని ఆనందపురం అగ్రహారం గ్రామానికి చెందిన సూరెబోయిన బాలయ్య, బాలగురవయ్య, మరో బాలగురవయ్యలు గ్రామంలో సర్వే నంబర్ 1లో 120 ఎకరాల ప్రభుత్వ భూమిని వినుకొండకు చెందిన గుర్రం అనంత క్రిష్ణకు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించారు. గత నెల వరకు ఉన్న హనుమంతునిపాడు తహసీల్దార్ ఎస్ .హరిబాబు కలెక్టర్‌గారి ఆదేశాల మేరకు వారిపై కేసు నమోదు చేయాయాలని ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ శివరామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నిందితులను పట్టుకొని సోమవారం కనిగిరి కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. జడ్జి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించగా వారిని ఒంగోలు జైలుకు తరలించారు.

రూ.2.75 కోట్ల వైఎస్సార్ బీమా చెల్లింపు

● డీఆర్‌డీఏ పీడీ రవికుమార్

ఒంగోలు టౌన్: వైఎస్సార్ బీమా పథకం కింద 2023లో ఇప్పటి వరకు మరణించిన వారికి రూ.2.75 కోట్లను ప్రభుత్వం నామినీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24కు సంబంధించి జూలై నెల 1 తేది నుంచి డిసెంబర్ 4 వరకు 514 సహజ మరణాలు, 83 ప్రమాద మరణాలు సంభవించినట్లు తెలిపారు. 83 ప్రమాద మరణాలకు సంబంధించిన క్లయిమ్‌లో 55 క్లయిమ్‌లను పూర్తి పరిష్కారం కాగా, ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.2.75 కోట్లను కేవలం 30 రోజుల్లో జమ చేసినట్లు వివరించారు. మిగిలిన క్లయిమ్‌లను కూడా త్వరలోనే చెల్లిస్తామన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఎవరైనా మరణిస్తే గతంలో రూ.5వేలను మట్టి ఖర్చుల కింద ఇచ్చేవారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.10వేలకు పెంచారని తెలిపారు. రేషన్ కార్డు కలిగి ఉండి వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన 18 నుంచి 70 ఏళ్ల వయసు కలిగిన కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే వైఎస్సార్ బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఈ పథకం కింద ప్రమాద వశాత్తు మరణించిన లేదా పూర్తి అంగ వైకల్యం కలిగినా రూ.5 లక్షల మేర ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. సహజంగా మరణించిన కుటుంబాలకు చెందిన నామినీకి రూ.లక్ష అందజేస్తామని తెలిపారు.

విశ్లేషణాత్మక అధ్యయనంతో విజయం

- సమకాలీన అంశాలపై సునిశిత పరిశీలన తప్పనిసరి
- వార్తా పత్రికలను ప్రణాళికాబద్ధంగా చదవాలి
- రోజూ రెండు మోడల్ పేపర్లు ప్రాక్టీస్ చేయడం ఉత్తమం
- కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి
- 'సాక్షి' అవగాహన సదస్సులో సివిల్స్ ర్యాంకర్, మెంటార్ బాలలత



'సాక్షి' అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్స్ ర్యాంకర్ బాలలత

ఒంగోలు: విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తే విజయం సొంతం చేసుకోవచ్చని గ్రూప్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి సివిల్స్ ర్యాంకర్ బాలలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2 అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ.. రోజూ వార్తా పత్రికల్లో ప్రధాన అంశాలను విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రస్తుత తుఫాన్‌కు మిచాంగ్ అని పేరు పెట్టారని, దీని వెనుక చరిత్రను అర్థం చేసుకోవాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న 13 దేశాలు తుఫాన్లకు పేర్లు పెడుతుంటాయని, ప్రతి దేశం 13 పేర్ల చొప్పున 169 పేర్లు సూచించాయని, ప్రస్తుత తుఫాన్‌కు మిచాంగ్ అని మయన్మార్ నామకరణం చేసిందని పేర్కొంటూ.. తుఫాన్‌కు సంబంధించి అధ్యయనం చేయడంపై అవగాహన కల్పించారు. అలాగే ఇటీవల కాలంలో షిప్పులపై దాడులు జరుగుతున్న ప్రాంతం ఏదీ అంటే ఎర్ర సముద్రం అనే విషయాన్ని ఆదివారం అమెరికా ప్రకటించిన అంశాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్స్‌పై సివిల్స్ పరీక్షల్లో సైతం మూడు ప్రశ్నలు వస్తున్నాయని, దీనిని బట్టి దానిని ఎంతగా అధ్యయనం చేయాలో తెలుసుకోవాలన్నారు. చాలా మంది పలు ప్రశ్నలను అవుటాఫ్ సిలబస్ అని భావిస్తూ ఉంటారని, కానీ అవన్నీ కూడా కరెంట్ అఫైర్స్‌తో లింక్ అయి ఉంటాయన్నారు. కరెంట్ అఫైర్స్ చాలా విస్తృతమైన అంశాలతో కూడుకున్నదని, కనుక ప్రతి అభ్యర్థి పూర్తిగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పత్రికల్లో మొదటి పేజీ, ఎడిటోరియల్, బిజినెస్, క్రీడా పేజీలు చదువుకుంటూ నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలని సూచించారు. గ్రూప్ పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ భౌగోళిక స్వరూపం, చరిత్ర, రాజకీయాలు, ఆర్థిక విషయాలపై పట్టు పెంచుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో రచయిత్రి మొల్లకు సంబంధించిన అంశం తెర పైకి వచ్చిందన్నారు. ఆమె పేరు ఎందుకు నేడు చర్చనీయాంశమైందో గమనించాలన్నారు. అదే విధంగా కొండవీడు కోట గురించి కూడా ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులపై ప్రత్యేక దృష్టి సారించి అనేక పథకాలు ప్రవేశపెట్టిన నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి అధ్యయనం చేయాలన్నారు. మన బడి నాడు–నేడు కార్యక్రమం, ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన సాల్ట్ పథకానికి సహకారం అందిస్తున్నది ఎవరు తదితర అంశాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్‌టీ ఈ ఏడాది ఎందుకు వార్తల్లో ముఖ్యంగా నిలిచిందనే అంశంపై కూడా అధ్యయనం చేయాలన్నారు.

చరిత్ర, సంస్కృతి, రాష్ట్ర పండుగలు, సింధునాగరికత, సాంస్కృతిక చరిత్ర, కళలు, మతాలు, 1857 నాటి సిపాయిల తిరుగుబాటు, ఢిల్లీ సుల్తానులు, రాజ్యాంగం, సామాజిక న్యాయం, అంతర్జాతీయ సంబంధాలు, కేశవానంద భారతి కేసును ఎందుకు నేడు సుప్రీంకోర్టు ప్రధానంగా ప్రస్తావించిందనే ప్రతి అంశాన్ని కూలంకషంగా అధ్యయనం చేయాలన్నారు. పత్రికల్లో వచ్చే అంశాలను విశ్లేషించుకుంటే అనేక ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయని పేర్కొన్నారు. భారత దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ప్రణాళికల గురించి నిత్య సాధన ఉండాలన్నారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న మార్పులు, ఆంధ్రప్రదేశ్‌లో ఏ పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు, ఏయే అంశాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది తదితర అంశాలను కూడా విశ్లేషించుకుని నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్నే తీసుకుంటే దీనిని ఏయే స్థాయిల్లో నిర్వహిస్తున్నారు, దీని లక్ష్యం ఏమిటి, దీనికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఎవరు ఉన్నారు, వారి గురించిన వివరాలను కూడా అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. ఏపీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుంటే ఇదే సమయంలో ఆరోగ్యం ప్రతి పౌరుని హక్కుగా రాజస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన అంశాలను మిళితం చేసుకుని చదవాలన్నారు. పర్యావరణం, బయో టెక్నాలజీ, నానో టెక్నాలజీ, సైబర్ స్పేస్ అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. చంద్రయాన్ 3 ప్రయోగం విశిష్టతలు, ఆదిత్య ఎల్–1 దేనిని పరిశోధిస్తోంది, రష్యా–ఉక్రెయిన్ వార్, ఇజ్రాయిల్–హమాస్ మధ్య దాడుల నేపథ్యంపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా పాత ప్రశ్నపత్రాలను సిలబస్ పూర్తి అయినప్పటినుంచి చదవాలనే ఆలోచన మానుకుని రోజూ రెండు ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేస్తూ రాని అంశాలపై అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే పట్టుసాధించగలరన్నారు.

శ్రీకాకుళానికి చెందిన పేద విద్యార్థి రోణంకి గోపాలకృష్ణ జాతీయ స్థాయిలో సివిల్స్ మూడో ర్యాంకు సాధించిన విషయాన్ని వివరించి అభ్యర్థుల్లో స్ఫూర్తి నింపారు. ఆశయం ఉన్నతంగా ఉంటే సరిపోదని, దానికి తగ్గట్లుగా సాధన కూడా ఉండాలన్నారు. రోజుకు ఎన్ని గంటలు చదివామనే దానికన్నా ఏకాగ్రతతో చదివామా లేదా అనేది గుర్తుంచుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా తాము సివిల్స్‌కు ప్రిపేరయ్యే విద్యార్థులకు క్లాసులు అందిస్తున్నామని వాటిని కూడా విద్యార్థులు ఫాలో అవుతూ సాధన చేయాలన్నారు. సాక్షి బ్రాంచి మేనేజర్ శివన్నారాయణ, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ శర్మ, సర్క్యులేషన్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పరిశీలనాత్మక అధ్యయనం తప్పనిసరి



పోటీ పరీక్షలు అనగానే చాలా మంది మార్కెట్లో లభించే మెటీరియల్‌పై ఎక్కువగా దృష్టిపెడుతుంటారు. దీనివల్ల సక్సెస్ సాధించడం కష్టం, కరెంట్ అఫైర్స్ అనేది రోజువారీ మారుతూ ఉంటుంది. కనుక నిత్యం పత్రికలను అధ్యయనం చేసి విశ్లేషించుకోవాలి. ఏకాగ్రత, స్పష్టమైన సమాచారం, ప్రణాళికాబద్ధమైన అధ్యయనంతోనే లక్ష్యాన్ని చేరుకోగలం.

– ప్రవీణ్, ఫ్యాకల్టీ

స్ఫూర్తిదాయకంగా ఉంది



నేను గ్రూప్ పరీక్షలకు ప్రిపేరవుతున్నా. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సు నాలో ఉన్న అనేక ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. సమకాలీన అంశాలపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు అవకాశాన్ని కల్పించింది. ఈ స్ఫూర్తితో నేను తప్పక విజయం సాధిస్తానన్న నమ్మకం కలిగింది.

– అనంత

ప్రిపరేషన్‌పై స్పష్టత



సాక్షి మీడియా నిర్వహించిన ఈ సదస్సు ద్వారా ప్రిపరేషన్‌కు ఎలా ప్లాన్ చేసుకోవాలో స్పష్టత వచ్చింది. రోజుకు ఎన్ని గంటలు ఏయే సబ్జెక్టుకు కేటాయించాలనేది కూడా అర్థం చేసుకున్నా. దీనిని బట్టి ప్లాన్ చేసుకోవడం ద్వారా రాబోయే పరీక్షల్లో విజయం సాధించగలనన్న నమ్మకం కలిగింది.

– అల్లూరిరెడ్డి

ప్రశ్నపత్రం తయారీపై అవగాహన



ప్రశ్నపత్రం ఎలా రూపొందిస్తారు, ఏయే అంశాలపై ఎక్కువగా దృష్టిపెడుతున్నారు, ప్రభుత్వ స్కీములను ఎలా అధ్యయనం చేయాలి తదితర అంశాలపై అవగాహన కలిగింది. దీనివల్ల అధ్యయనం చేసే విధానంలో మార్పులు చేసుకోవడానికి అవకాశం కలిగింది. కోచింగ్ తీసుకోలేని వారికి ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– వెంకట్రావు

సివిల్స్ విజేతల స్ఫూర్తి కథనాలు ఆసక్తి రేకెత్తించాయి



సివిల్స్ విజేతల స్ఫూర్తిదాయక కథనాలు నాలో ఆసక్తి రేకెత్తించాయి. కేవలం పట్టుదల, ఏకాగ్రత, పక్కా ప్లానింగ్‌తో, రోజువారీ కృషి ద్వారా వారు సాధించిన విజయాలు సివిల్స్‌లో రాణించాలనే పట్టుదలను పెంచాయి. 'సాక్షి' మీడియా నిర్వహించిన ఈ సదస్సు నాలాంటి ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.

– జ్యోతి

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



గ్రామ సచివాలయి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ప్రజలకు పరిపూర్ణ సేవలు అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, నవరత్నాల పథకాలను చివరి ఇంటి వరకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని బోయలపల్లెలో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకొని రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు చెందిన పేద ప్రజలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పథకాలు సక్రమంగా అందాయా, లేదా అని తెలుసుకోవటానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే కార్యక్రమంలో తక్షణమే పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. జగనన్న పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి ఆ తరువాత మోసం చేయడమే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకే చెందుతుందని, 14 ఏళ్ల పాటు సీఎంగా వెలగబెట్టిన చంద్రబాబు ప్రజలకు చేసింది ఏం లేదని, ఇప్పుడు తానేదో చేస్తానని అనడంలో నిజం లేదని రాష్ట్ర ప్రజలే బాహాటంగా చెప్తున్నారని ఆయన అన్నారు. జగనన్న సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో చెప్పిన వాగ్దానాలన్నీ 98శాతం నెరవేర్చారని, అన్ని వర్గాల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా తమ పిల్లలను బడికి పంపించే ప్రతి తల్లి అకౌంట్‌లో నేరుగా డబ్బులు జమచేస్తున్నారని, దీని వల్ల పేద కుటుంబాలకు ఊరట కలిగిస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు జగనన్న చేసిన వాగ్దానం ప్రకారం పింఛన్ పెంచుకుంటూ పోతూ వచ్చే నెల ఒకటవ తేదీన రూ.3వేల ప్రకారం అందుతుందన్నారు. మహిళల అభివృద్ధిని అకాంక్షించే జగనన్న చేయూత, ఆసరా, చేదోడు, తోడులాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. తన పాలనలో మంచి జరిగిందా, లేదా, సంతృప్తి చెందితేనే ఓటు వేయండని జగనన్న చెప్తున్నారని, అటువంటి నాయకుడిని తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి అన్నారు. దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి 98 ఎకరాల అసైన్డ్‌మెంట్ పొలాలకు సంబంధించి 26 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు కొల్లా చిన్న వెంకటేశ్వర్లు, నాగరాజు వెంకటేశ్వర్లు, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, బి.బాలచెన్నయ్య, డీఎల్‌డీఓ బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఈఓపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏపీఓ శైలజ, ఏఈలు సుబ్బయ్య, అంజిరెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేటి జాబ్‌మేళా వాయిదా

ఒంగోలు టౌన్: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఈనెల 5వ తేదిన హర్షిణి డిగ్రీ కళాశాలలో నిర్వహించ తలపెట్టిన జాబ్‌మేళాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా ఉపాధి అధికారి టి. భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలపారు. ఇంటర్వ్యూ కోసం దరఖాస్తు చేసుకొని వేచి చూస్తున్న అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, తుఫాన్ నేపథ్యంలో మారిన వాతావరణం దృష్ట్యా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



తీవ్రంగా గాయపడిన ఖాశింవలిని 108లోకి ఎక్కిస్తున్న ఎస్సై

బేస్తవారిపేట: కారు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని శాంతినగర్ సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై సోమవారం జరిగింది. దోర్నాలకు చెందిన షేక్ ఖాశింవలి(35) గత రెండేళ్లుగా భార్య పుట్టినిల్లు గిద్దలూరు మండలం ముండ్లపాడులో మోటార్‌సైకిల్ మెకానిక్ షాపులో పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. కంభం మండలంలోని నాగులవరంలో సమీప బంధువు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చూసేందుకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో బేస్తవారిపేట నుంచి కొమరోలు వెళ్తున్న కారు ఢీకొనడంతో ఖాశింవలి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్సై బి.నరసింహారావు క్షతగాత్రున్ని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య రేష్మ, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

● ఎస్పీ మలికా గర్గ్



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 42 మందితో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సమస్య పూర్వాపరాలు అడిగి తెలుసుకుని, వాటిని చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలపై అర్జీలు వచ్చాయని పోలీస్ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస రావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివ రామకృష్ణ, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్‌రావు



చెంచులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు

యర్రగొండపాలెం: గిరిజనుల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటు చేశారని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి.శంకర్ రావు పేర్కొన్నారు. సోమవారం వైపాలెం మండలంలోని పునరావాస కాలనీ, హనుమంతునిగూడెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పునరావాస కాలనీలో రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన గిరిజనుల ముఖాముఖి కార్యక్రమంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమ్మ ఒడి కింద తల్లుల ఖాతాల్లో రూ.13500 జమ చేస్తూ, బడుగు, బలహీన వర్గాల పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని, విదేశీ విద్యకు సైతం ప్రభుత్వం చేయుతనిస్తోందన్నారు. జగనన్న కాలనీల్లో గృహాలు ఏర్పాటు చేసుకునే గిరిజనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలకు బ్యాంకుల్లో రుణ సదుపాయం కల్పించడంతోపాటు రైతు భరోసా పథకం వర్తించే విధంగా చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి గిరిజన గూడెంలో మౌలిక వసతులు కల్పించి, సమస్యలపై వెంటనే స్పందించాలని రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని గిరిజనులను కోరారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, కమిషన్ సెక్రటరీ పి.పద్మ, సభ్యులు వడితే శంకర్‌నాయక్, లిల్లి సురేష్, రామలక్ష్మి, మురళి, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మిరెడ్డి, ఎంఈఓ పి.ఆంజనేయులు, ఐటీడీఏ డీవైఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు శ్రీకాంత్, అంజిరెడ్డి, ఏపీఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కేంద్రియ విద్యాలయాల ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

ఒంగోలు: దేశంలో, రాష్ట్రంలో నూతన కేంద్రియ విద్యాలయాల ఏర్పాటుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నలేవనెత్తారు. వెనుకబడిన ప్రాంతమైన ఒంగోలు పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసే కేంద్రియ విద్యాలయాలపై ప్రభుత్వాల ప్రతిపాదనలు, వాటి ప్రదేశాలు, ఎప్పటిలోగా ప్రారంభిస్తారని అందులో ప్రస్తావించారు. ఈ ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయక శాఖామంత్రి అన్నపూర్ణాదేవి సమాధానం ఇచ్చారు. దేశంలో 1252 కేంద్రియ విద్యాలయాలు పనిచేస్తున్నాయని, రాష్ట్రంలో 35 ఉన్నాయన్నారు. నూతన కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు ప్రతిపాదనలు, ఏర్పాటుకు అవసరమైన అన్ని సదుపాయాలు, స్థలాలు, తాత్కాలిక వసతి సమాచారం ముందుగానే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సేకరించి నిర్ణయిస్తాయన్నారు. సంబంధిత శాఖల నుంచి అనుమతులు రాగానే నూతన విద్యాలయాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు.

కోమాలో ఉన్న వ్యక్తి మృతి

మద్దిపాడు: బైక్ ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లిన వ్యక్తి సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. సన్నమూరు గ్రామానికి చెందిన బోడెపోగు వజ్రయ్య(32) గత నెల 28న చీమకుర్తిలో కుమారుడికి వైద్యం చేయించుకుని తిరిగి వస్తూ విజయలక్ష్మీపేట వద్ద నీలిశెట్టి చిన్నయోగయ్య అనే యువకుడిని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయమై కోమాలోకి వెళ్లిన వజ్రయ్య గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్సై వివరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య లత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.